క్లుప్తంగా

మద్యం మత్తులో దాడి చేశారని ఫిర్యాదు

ఇచ్ఛాపురం రూరల్: మద్యం సేవించి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని మండపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి సీఐ ఎం.చిన్నంనాయుడుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు మీద బైక్‌పై ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తన ముక్కుపై పిడుగుద్దులు గుద్దడంతో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మామయ్యరెడ్డిని ఫోన్‌లో పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఉత్కళాంధ్ర కవి సమ్మేళనం రేపు

పలాస: పలాసలోని చిన్న ఉదయపురంలో ఉన్న లయన్స్ క్లబ్ హాల్‌లో ఈ నెల ఆరో తేదీ ఉదయం పది గంటలకు ఉత్కళాంధ్ర కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ కుమార్‌నాయక్, వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఆహ్వానితులచే కవి సమ్మేళనం ఉంటుందని.. ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. పాల్గొన్న వారిని సత్కరించి గౌరవిస్తామన్నారు.

డీఆర్‌డీఏ పీడీ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

కంచిలి: మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో వివిధ అంశాలపై అత్యవసర సమీక్షను నిర్వహించారు. మండలంలో పలు పథకాల పనితీరుపై వాకబు చేశారు. ఏపీఎం అప్పలనర్సమ్మ, ఎంఎంఎస్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన

టెక్కలి: మిషన్ వాత్సల్య కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలని కోటబొమ్మాళి మండలం దంత సర్పంచ్ గొండు చాందిని అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మిషన్ వాత్సల్యపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల రక్షణ, శ్రేయస్సు నిర్ధారించడంలో మిషన్ వాత్సల్య పథకం గణనీయమైన ప్రాముఖ్యత కలిగి ఉందని వెల్లడించారు. పిల్లల హక్కులు, కిశోర బాలికలకు శారీరక, సామాజిక సమస్యలు, వాటి నివారణ, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడం, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నరేష్, రవి, నీలవేణి చంద్రశేఖర్, గౌరీ, చిన్నమ్మడు, ఉపాధ్యాయులు నిర్మల, రామారావు, జ్యోతి, వేణుగోపాలరావు, గణేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు ద్రాక్షాయిని, ద్రాక్ష వేణి, రాజేశ్వరి ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



ఆనందరావు (ఫైల్)

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ గుడ్ల ఆనందరావు శుక్రవారం మృతి చెందారు. 1988 నుంచి 95 వరకు సర్పంచ్‌గా వ్యవహరించిన ఆయన పట్టణ వైశ్య సంఘానికి అధ్యక్షునిగా సేవలు అందజేశారు ఈయన మృతిపై కళింగ వైశ్య, వర్తక, వ్యాపార సంఘంతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు.

పంట పొలాల్లో బస్సు బోల్తా

యలమంచిలి రూరల్: అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పురుషోత్తపురం సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సు పురుషోత్తపురం సమీపంలో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కగా ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి కొబ్బరి చెట్టును ఢీకొట్టింది. అప్పటివరకూ సాఫీగా ప్రయాణిస్తున్న బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురై అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో బస్సులో ప్రయాణికులంతా భయంతో కేకలు పెట్టారు. ప్రమాద సమయంలో బస్సులో 22 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఆరుగురు గాయపడ్డారు.

విద్యుత్ వెలుగుల్లో నువ్వలరేవు



గ్రామ ముఖద్వారం వద్ద విద్యుత్ దీపాలు

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాల అలంకరణలు అలరిస్తున్నాయి. గ్రామం ముఖద్వారం నుంచి బృందావతి అమ్మవారి ఆలయం వరకు, అలాగే పలు వీధుల్లో విద్యుత్ దీపాలను అమర్చారు. గ్రామమంతా విద్యుత్ వెలుగులతో మెరిసిపోతుంది.



రైతన్నా మేలుకో..!

వజ్రపుకొత్తూరు:

పంట కోతల తరువాత వర్షాకాలం వచ్చేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు సైతం ఉన్నాయన్న సంగతి మర్చిపోతాం. చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమి నుంచి పోవాలంటే వేసవి దుక్కులు కచ్చితంగా చేయాల్సిందే. దీనికి అనుకూల సమయం ఇదే కాబట్టి రైతులు మేల్కోవాల్సిందే. దుక్కలకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా సాగు పద్ధతులు పాటిస్తే సత్ఫలితాలు ఉంటాయి.

పలాస నియోజకవర్గంలో ఇలా..

పలాస నియోజకవర్గంలో వేలాది ఎకరాలు వ్యవసాయ యోగ్యమైన భూములు ఉన్నాయి. వీటిలో వజ్రపుకొత్తూరు మండలంలో 6,890 ఎకరాలు, మందసలో 15,300, పలాసలో 10,250 ఎకరాల్లో వరితో పాటు పొద్దుతిరుగుడు, వేరుశనగ, మిరప తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రబీ సీజన్ దాదాపు ముగియడంతో వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటి నుంచే ఖరీఫ్ కోసం సన్నద్ధమవుతున్నారు. పలాస మార్కెట్ యార్డు వద్ద గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధునాతన వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఉండడంతో రైతులకు మరింత ప్రయోజనం కలుగుతోంది. ఇప్పటికే భూసార పరీక్షల కోసం వజ్రపుకొత్తూరు నుంచి 1031 మట్టినమూనాలు, మందసలో 1196, పలాసలో 827 సేకరణను సంబంధిత అధికారులు పూర్తి చేశారు. ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు వేసవి దుక్కులు చేసుకోవడానికి అనుకూలం.

వర్షాలకు ముందే దున్నుకోవాలి..

వర్షాలకు ముందు భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. వేసవి దుక్కులు వల్ల ఇతర గడ్డి జాతి మొక్కల విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు మొలిచే శక్తిని కోల్పోతాయి. వేరుకుళ్ల తెగులను కలిగించే శిలీంద్ర సిద్ధ బీజాలు నిత్యం భూమి అడుగు భాగానే ఉంటూ వర్షం పడగానే విజృంభించి పంటలను నాశనం చేస్తాయి. భూమి అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే చిగురించి పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండు వాళలు ఎత్తి దుక్కులు దున్నాలి. వేసవి దుక్కులతో భూమి వదులుగా మారి వర్షం పడినపుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది.



వజ్రపుపొత్తూరలో మట్టినమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ప్రయోజనాలు ఇవీ..

వేసవిలో చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్ర బీజాలు భూమిని ఆశ్రయిస్తాయి. ప్రధానంగా వరి, వేరుశనగ, రాగులు, మిరప తదితర పంటలను ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగు, వేరుకుళ్లు చేసే పురుగు, ఇతర శిలీంద్రాల జాతికి చెందిన పురుగులు భూమిలో ఉంటాయి. వేసవిలో లోతుగా దుక్కులు చేయడంతో నేలలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు బయటపడి వేడి తాపానికి చనిపోతాయి. కొంగలు, కాకులు తదితర పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేయడంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులతో భూసారం పెరుగుతుంది. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ ఇప్పటికే పూర్తి చేశాం. భూసారం పెంచేందుకు ఉన్న పద్ధతులన్నీ రైతులకు సూచిస్తున్నాం. వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉండే చీడపురుగు గుడ్లు, లార్వాలు, కోశస్థ దశలో ఉన్న శిలీంద్ర బీజాలు నశిస్తాయి. వీటివల్ల పురుగు మందుల వాడకం తగ్గుతుంది. వరి కోతలు తరువాత వాలుకు అడ్డంగా దుక్కులు చేయడం ద్వారా తొలకరి వర్షాలకు నీరు భూమిలోకి ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది. ప్రతీ రైతు వేసవి దుక్కులు చేపట్టాలి. భూసార పరీక్షలు కూడా కచ్చితంగా చేయించుకోవాలి.

– ఎల్.వి.మధు, సహాసంచాలకులు, వ్యవసాయశాఖ, పలాస

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



సాంబమూర్తి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బుడ్డేపు సాంబమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం కొఠారీ గ్రామానికి వెళ్లి సాంబమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానంద రెడ్డి, సర్పంచ్‌లు దుక్క ధనలక్ష్మి, కారంగి త్రినాథ్, నర్తు వరప్రసాద్ యాదవ్, సాడి గురుమూర్తి, కుందేశి ప్రియా, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు ఉన్నారు. అలాగే ఈదుపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గయా రత్నాలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, పాస్టర్ పి.ప్రకాశరావు, క్రిస్టియన్ సోదరులు రత్నాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు ఆహ్వానం

కాశీబుగ్గ: వేసవి నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి పలాస విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంఘ అధ్యక్షులు బమ్మిడి సంతోష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు తమ పేర్లను ఈ నెల 15వ తేదీలోగా 86393 59435 నంబర్‌కు తెలియజేసి నమోదు చేయించుకోవాలని సూచించారు. మొదటి మూడు స్థానిల్లో నిలిచిన జట్లకు రూ. 20 వేలు, రూ.పది వేలు, ఏడు వేల రూపాయలను బహుమతిగా అందజేస్తామన్నారు.

పిల్లలను కళాత్మకంగా పెంచాలి



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

వజ్రపుకొత్తూరు: తల్లిదండ్రులు తమ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంతోపాటు కళాత్మకంగా పెంచాలని అంతర్జాతీయ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, అంతర్ముఖి సీఈవో డాక్టర్ మాకేన సతీష్‌కుమార్ అన్నారు. పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థల ప్రాంగణంలో గురువారం రాత్రి విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలతో తల్లిదండ్రులు సత్సంబంధాలు కొనసాగించాలని, రోజూ వారి కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీల, డాక్టర్ చాపర కోదండరావు, పలాస, మందస టెక్కలి ప్రాంతాలకు చెందిన వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు, కరస్పాండెంట్ కణితి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాశరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీనివాసరావు ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం: శ్రీరామనవమి వసంతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని దాసన్నపేట శ్రీరామాలయం వద్ద 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వసంతనవరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని తేన్నేటి తేజేశ్వరశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సామూహిక కుంకమ పూజలు జరిగాయి.

ప్రజల తరఫున పోరాటం చేద్దాం



కమిటీ సభ్యులతో పేరాడ తిలక్ తదితరులు

● వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్

టెక్కలి: మోసపూరిత హామీలతో కూటమి నాయకుల చేతిలో మోసపోయిన ప్రజల తరఫున పోరాటం చేద్దామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. వైఎస్సార్‌సీపీ టెక్కలి మండల స్థాయి కమిటీలో వివిధ హోదాల్లో నియమించిన వారితో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తారని నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వం చేతిలో మోసపోయారని గుర్తు చేశారు. ఇటువంటి సమయంలో ప్రజలకు అండగా.. వైఎస్సార్‌సీపీ బలోపేతం దిశగా సమిష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎటువంటి కక్ష పూరిత చర్యలు జరిగినా భయపడవద్దని.. ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు, ప్రజలపై ఎటువంటి కక్షసాధింపు చర్యల జరిగినా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొంతమంది కుట్రలు చేస్తారని అటువంటి వాటిని తిప్పికొట్టాలని కోరారు. కమిటీ సభ్యులను అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం, సర్పంచ్ ఆర్.జయమోహన్, నాయకులు ఎ.రాహుల్, జె.తిరుమలరెడ్డి, బి.గోపాల్, యు.తమ్మయ్య, ఎస్.జగదీష్, ఎస్.ఉమాపతి, బి.రాజేష్, డి.కుశుడు, కె.చిన్నారావు, గురివినాయుడు, ఆంజనేయులు, డి.కామన్న, ఎస్.సోమేష్, జి.శ్యామలరావు, మదీన్, వి.నారాయణ పాల్గొన్నారు.


సారా నిర్మూలనకు సహకరిస్తాం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మందస: సారా నిర్మూలనకు తమవంతు సహకరిస్తామని మందస వర్తక సంఘం సభ్యులు అధికారులుక హామీ ఇచ్చారు. ఎక్సైజ్ అధికారులు తమను అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారని పలువురు వర్తకులు గురువారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో స్థానిక వర్తక సంఘ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.హైమావతి, సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బేబి, స్థానిక ఎస్.ఐ కె.కృష్ణప్రసాద్ శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సారా తయారు చేసే వారికి నల్ల బెల్లం విక్రయించరాదని.. అలా చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. దీనికి వైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వడ్డి గోపాలకృష్ణ, రమేష్ మాట్లాడుతూ.. సారా నిర్మూలనకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంఘ ప్రతినిధులు నరేష్, మహేష్, శ్రీను, త్రినాథ్, సంతోష్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం



కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీలను అధిష్టానవర్గం నియమించింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు శుక్రవారం వివరాలను వెల్లడించింది. కంచిలి మండల పార్టీ ఉపాధ్యక్షులుగా తలగాన రుద్రమూర్తి, కొత్తకోట చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా మడ్డు వెంకటరావు, గుమ్మడి గోపాల్, లింగం కేశవరావు, డొక్కరి దాలయ్య, సెక్రటరీలుగా బేసి రమేష్, కెత్రో దొళాయి, ప్రధాన లజపతిరావు, బుడ్డేపు ఆనంద్, పండి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వివేక్ నహరి, కర్రి కూర్మారావు, కిలుగు అరావతి, మెండ మురళి, అభిమన్యు ప్రధాన్, సీహెచ్ భీమారావు, కాయ నూకయ్య, పితంబర్ రవికుమార్, బర్రి సుజాత, గుమ్మడి చంద్రయ్య నియమితులయ్యారు.

ఇచ్ఛాపురం మండలం..

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యక్షులుగా ఇసురు తులసీరామ్, జనపాన రామచంద్ర, ముఖ్య కార్యదర్శులుగా రంగాల జాని, కాళ్ల నారాయణ, ఉదయ్ బెహరా, ఆశి మంథాకిని, కార్యదర్శులుగా ఆశి పేరయ్య. కుందేశి ప్రియా, దున్న తిరుపతి, బింగి నీలాద్రి, కొప్పల హేమంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బోరుబద్ర పాపయ్య, కీలు ఉమాశంకర్, సాడి మోహనరావు, పెదిని పున్నయ్య, బుడ్డ మేనక, సీరపు లలిత, ఉల్ల మహంతి, పిట్ట బాలరాజు, రాపాక చంద్రయ్య, లండ పితంబర్ నియమితులయ్యారు.

సోంపేట మండలం..

సోంపేట: ఉపాధ్యక్షులుగా తెల్లి వైకుంఠరావు, పిన్నింటి రేఖారావు, జనరల్ సెక్రటరీలుగా దున్న మాధవరావు, మల్లా వెంకటరమణ, పెద్దింటి రాజేశ్వరరావు, డి.మాధవరావు, సెక్రటరీలుగా గోకర్ల ధర్మారావు, కోట్ని శ్రీనివాసరావు, బైపల్లి కూర్మమ్మ, టెంక రాజు, శ్రీకాకుళం శ్రీను, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఉగ్రపల్లి కోదండరావు, మంగి జ్ఞానేశ్వరరావు, సాహుకారి జానకీరావు, పల్లి శకుంతుల, నర్తు తులసీరావు, బట్టి శ్రీనివాసరావు, పిరియా అప్పలస్వామి, మడ్డు ఈశ్వరరావు, పాతిన మాధవరావు, సవర త్రినాథ్, గండు లక్ష్మీనారాయణ, పొట్టి రాజేశ్వరి, బంగారు పాపారావు, వి.వి.ఆర్.నెహ్రూ, పెద్దింటి డిల్లీరావు, కోటరాజు నియమితులయ్యారు.

ఇచ్ఛాపురం పట్టణం..

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణ ఉపాధ్యక్షులుగా చిడిపోతు జగన్, కొంతాల రాంమూర్తి, జనరల్ సెక్రటరీలుగా సుగ్గు ప్రేమ్‌కుమార్, నీలాపు డిల్లీరావు, పి.దానయ్య, సాలిన బాలాజీ, సెక్రటరీలుగా బర్ల లక్ష్మణరావు, కేశవపట్నం హరినారాయణ, కాళ్ల తేజ, పోతల ఈశ్వరరెడ్డి, బుడుపు త్రినాథ్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా కోన నీలాద్రి, కంబాల వెంకటరమణ, నందిక మదన్‌కుమార్, సాలిన గంగులు, టెంక లోకేష్, కిరణ్ బెహరా, పటాన కృష్ణ, రెయ్య నారాయణ, బొందాడ మహేష్, జయరాం నియమితులయ్యారు.



అమ్మవారికి పూజలు

కవిటి మండలం ప్రగడపుట్టుగ జంక్షన్‌లో ఉన్న గుండమ్మ పేరంటాలు అమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ, కవిటి, గొండ్యాలపుట్టుగ గ్రామాలకు చెందిన భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏకాహం భజన కాలక్షేపాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. –కవిటి



చలివేంద్రం ప్రారంభం

పలాస మండలం రెంటికోట మెయిన్ రోడ్డులో చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన దీన్ని రెంటికోట వైద్యాధికారి డాక్టర్ మౌనిక, సర్పంచ్ తిరుమలరావు ప్రారంభించారు. వేసవిలో ఈ మార్గంలో ప్రయాణించేవారికి చలివేంద్రం అండగా ఉంటుందన్నారు. ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు బోనెల గోపాల్, పంచాయతీ కార్యదర్శి సద్గుణరావు, నాయకులు కరియా మంత్ర, పి.హెచ్.ఎన్.సత్యవతి, సూపర్‌వైజర్లు రిషికేశవరావు, ఈశ్వరమ్మ, యూడీసీ సుదర్శన, విమల, ప్రభావతి, త్రివేణి, యోగేశ్వరి పాల్గొన్నారు. –పలాస



బాల్య వివాహాలను అరికట్టాలి

బాల్యవివాహాలు జరగకుండా బాలల సంరక్షణ కమిటీలు కృషి చేయాలని ఐసీడీఎస్ పీవో నాగరాణి అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని బాలికల ఉన్నతపాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డుల్లో కిశోరీ వికాస సమావేశాలు నిర్వహించి బాల్యవివాహాల వల్ల చేకూరే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బాలల సంరక్షణ కమిటీలు ప్రయత్నించాలన్నారు. –ఇచ్ఛాపురం టౌన్

సంక్షిప్తంగా...

13న పైలా స్మారక సభ

కాశీబుగ్గ: భారత విప్లవోద్యమంలో శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటానికి ప్రత్యేక రాజకీయ విశిష్టత ఉందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. పలాసలో టీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అమరజీవి పైలా వాసుదేవరావుకు చరిత్రలో సుస్థిర స్థానం ఉందన్నారు. ఆయన మరణించి 15 ఏళ్లు నిండుతుందని, ఈ సందర్భంగా 13న పలాసలో వాసుదేవరావు వర్ధంతి సభను నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్, పీవైఎల్ జిల్లా కన్వీన సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: తన కుమార్తె గురువారం నుంచి కనిపించడం లేదని పలాస మండలం గరుడఖండి గ్రామానికి చెందిన సిగలపల్లి చంద్రకళ ఫిర్యాదు చేసినట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు. తన కుమార్తె ఇంటర్ చదువుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

న్యాయ సేవలపై అవగాహన కల్పించాలి

టెక్కలి: ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న వివిధ రకాల న్యాయ సేవలపై పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కలిగించాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత కోరారు. శుక్రవారం మీడియాతో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది మే పదో తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునే విధంగా న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎంఎంఎస్ కార్యాలయం సందర్శన

నందిగాం: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆవశ్యక అంశాల గురించి సమీక్ష నిర్వహించారు. ఏపీఎంలు మనోరత్నం, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఊడికలపాడులో శ్రీరామనవమి ఉత్సవాలు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం ఊడికలపాడు గ్రామంలోని శ్రీరామ ఆలయంలో శుక్రవారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, స్థానిక నాయకుడు అప్పలస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో పండితుడు నునరాపు చంద్రశేఖరశర్మ పర్యవేక్షణలో పూజలు చేశారు.

మన బడిలోనే పిల్లలను చదివిద్దాం

నందిగాం: మన ఊరులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే మన పిల్లలను చదివిద్దామని మండల విద్యాశాఖాధికారి జి.నర్సింహులు అన్నారు. పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో-2 చిన్నారావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభం

కంచిలి: స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో స్వచ్ఛభారత్, మండలపరిషత్ నిధులు రూ. 5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అలాగే ఎంపీడీవో కోసం ఏర్పాటు చేసిన నూతన చాంబర్‌ను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవోలు ఎస్.శివరాం ప్రసాద్, కె.చిట్టిబాబు, ఏవో రమణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్, వైఎస్సార్‌సీపీ నేతలు లడ్డు కేశవపాత్రో ఉన్నారు.